దరఖాస్తులు వేగంగా పరిష్కరించండి: కలెక్టర్


యాప్‌లో ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల క్రమబద్ధీకరణను పరిశీలిస్తున్న కలెక్టర్

గద్వాల కలెక్టరేట్, ఇటిక్యాల, న్యూస్‌టుడే: ఎల్ఆర్ఎస్‌లో క్రమబద్ధీకరణకు వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి వేగవంతంగా పరిష్కరించాలని కలెక్టర్ సంతోష్ అధికారులను ఆదేశించారు. గురువారం గద్వాల పుర పరిధిలో, ఎర్రవల్లి మండలం తిమ్మాపూర్ రెవెన్యూ శివారులో దరఖాస్తులను క్షేత్రస్థాయిలో మొబైల్‌యాప్‌లో ఎలా నమోదు చేస్తున్నారు అనే అంశాన్ని అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణతో కలిసి పరిశీలించారు. ప్రభుత్వం మార్గదర్శకాల ప్రకారం దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. ప్రభుత్వ భూములు, బఫర్‌జోన్, నాలా, నీటి వనరులు, అప్రోచ్‌రోడ్లు, కోర్టు కేసుల విషయాలను పరిశీలించాలని సూచించారు. పుర కమిషనర్ దశరథ్, డీపీవో శ్యాంసుందర్, ఈఈ శ్రీనివాసులు, టౌన్ ప్లానింగ్ అధికారి కుర్మన్న తదితరులు పాల్గొన్నారు.

అధికారుల నిర్లక్ష్యం.. తరలుతున్న పత్తి

పూర్తిస్థాయిలో ఏర్పాటు కాని కొనుగోలు కేంద్రాలు
తక్కువకు కొంటున్న దళారులు, కర్ణాటక వర్తకులు


ఉండవల్లి: సీసీఐ కొనుగోలు కేంద్రం ఏర్పాటు కోసం అధికారులు పరిశీలించిన పత్తిమిల్లు

న్యూస్‌టుడే- కోస్గి, ఉండవల్లి, మానవపాడు : పత్తి పంటపై రైతులు పెట్టుకున్న ఆశలను వర్షాలు దెబ్బతీశాయి. ఉన్న పంటను అమ్ముకుందామంటే కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు అధికార యంత్రాంగం మీనమేషాలు లెక్కిస్తోంది. ఫలితంగా దళారులకు తెగనమ్ముకుంటున్నారు. పెద్ద ఎత్తున పంట కర్ణాటకకు తరలిపోతోంది. కొందరు రైతులు పత్తి తీసి ఇళ్లలో నిల్వ చేశారు. వరుసగా కురుస్తున్న వర్షాలతో పత్తి నాని ఇబ్బందులు పడుతున్నారు. భారతీయ పత్తి సంస్థ (సీసీఐ) ఆధ్వర్యంలో మార్కెటింగ్ అధికారులు కొనుగోలు కేంద్రం ఏర్పాటుకు సిద్ధమయినా, నేటికీ అందుబాటులోకి రాకపోవడంతో అన్నదాతలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. వరుసగా వర్షాలు కురుస్తుండడంతో తేమశాతం పెరుగుతుందని, అందుకే అధికారులు వెనుకడుగు వేస్తున్నారని రైతుసంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు.

కర్షకుల నిరసనలు: ధన్వాడలో పత్తి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని రైతులు ధర్నా నిర్వహించారు. ఉమ్మడి జిల్లాలో పలు చోట్ల నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఉండవల్లి శివారులోని జాతీయ రహదారి పక్కనున్న పత్తి మిల్లులో సీసీఐ కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయకపోవడంపై రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. నారాయణపేట జిల్లాలో జిన్నింగ్ మిల్లులకు కొందరు తరలిస్తున్నారు. నారాయణపేట, గద్వాల జిల్లాల్లోని సరహద్దు ప్రాంతాల్లో కర్ణాటక దళారులు పంటను తరలిస్తున్నారు. కోస్గి, మద్దూరు, గుండీడ్ మండల రైతులు వికారాబాద్ జిల్లా తండూరులో విక్రయిస్తున్నారు. అలంపూర్ నియోజకవర్గంలో జిన్నింగ్ మిల్లులు ఉన్నప్పటికీ వాటిని ఆలస్యంగా ప్రారంభిస్తుండడంతో దళారులు రంగప్రవేశంచేసి తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో సాగు ఇలా..: ఉమ్మడి మహబూబ్‌నగర్‌లో 5.88 లక్షల ఎకరాలలో పత్తి సాగు అయ్యింది. గత ఏడాది కన్నా కొంత తగ్గింది. 41.19 లక్షల కింటాళ్ల పత్తి దిగుబడి ఉంటుందని వ్యవసాయ అధికారులు అంచనా వేస్తున్నారు. కొనుగోలు కేంద్రానికి వచ్చే పత్తి తేమశాతం 8 నుంచి 12 లోపు ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని గతంలో అధికారులు సూచించారు.

ఉమ్మడి జిల్లాలో సాగు ఇలా..

జిల్లా	2022	2023	2024
మహబూబ్‌నగర్	1,15,380	85,830	79,128
నారాయణపేట	2,05,807	1,84,597	1,85,150
నాగర్‌కర్నూల్	3,52,429	2,35,530	2,10,970
వనపర్తి	21,689	17,411	12,301
జోగులాంబ గద్వాల	2,22,908	1,44,075	1,20,597

తక్కువ ధరకు అమ్ముకున్నా..

ఈ ఏడాది 9 ఎకరాల్లో పత్తి పంటను సాగుచేశాను. సుమారు 70 క్వింటాళ్ల పత్తి వచ్చింది. క్వింటా రూ.6,150 చొప్పున గ్రామంలోనే వ్యాపారులకు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకన్నా తక్కువకు విక్రయించాను. సీసీఐ కొనుగోలు కేంద్రం ఉంటే క్వింటాకు కనీసం రూ.వెయ్యి అదనంగా వచ్చేది. నాకన్నా తక్కువ అమ్ముకునేవారూ ఉన్నారు. రైతుల వేదన అధికారులు ఆలకించాలి.



- చిన్న మద్దిలేటి, రైతు, చెన్నిపాడు

ఉన్నతాధికారులకు నివేదించాం..: సీసీఐ కేంద్రం ఏర్పాటు గురించి అలంపూర్ మార్కెట్ కమిటీ ఛైర్మన్ దొడ్డెన్న, వైస్ ఛైర్మన్ కొమ్ముకుమార్, ఉన్నతాధికారులతో చర్చించానని, దీపావళి తర్వాత కేంద్రం ఏర్పాటయ్యే అవకాశాలున్నట్లు అలంపూర్ మార్కెట్ యార్డు కార్యదర్శి యల్లాస్వామి అన్నారు.

అక్విడెక్ట్ పనులు అడుగు ముందుకు

విద్యుత్తు శాఖకు రూ.11 లక్షల జమ ● లైన్ల తొలగింపే ఆలస్యం


కొండపల్లి వద్ద నిర్మాణంలో ఉన్న అక్విడెక్ట్‌కు అడ్డంకిగా ఉన్న లైన్లు

ఈనాడు కథనానికి స్పందన

ధరూర్, గద్వాల కలెక్టరేట్, న్యూస్‌టుడే: అధికారుల మధ్య సమన్వయలోపంతో ఆగిన 99 ప్యాకేజీ కొండపల్లి అక్విడెక్ట్ నిర్మాణం పనుల్లో అడుగు ముందుకు పడింది. కేవలం రూ.11 లక్షలు చెల్లింపులు విద్యుత్తు శాఖకు చేయకపోవడంతో విద్యుత్తు లైన్ల తొలగించక పనులు నిలిచిపోయాయి. దీనిపై 'ఈనాడు'లో నాలుగు నెలలుగా ఇస్తున్న వరుస కథనాలతో కదలిక వచ్చింది. ఎట్టకేలకు పనులకు అడ్డంకిగా ఉన్న విద్యుత్తు 11/33 కేవీ లైన్ తొలగించనున్నట్లు తెలిసింది. ఇందుకు విద్యుత్తు శాఖకు జమచేయాల్సిన షిఫ్టింగ్ ఛార్జీలు 15 రోజుల కిందట జమ చేసినట్లు సాగునీటి శాఖ అధికారులు తెలిపారు. ప్రస్తుతం విద్యుత్తు శాఖ అధికారులపై పాలకులు ఒత్తిడి పెంచి విద్యుత్తు లైన్ల తొలగింపునకు తక్షణ చర్యలు తీసుకునేలా చూడాల్సిన అవసరం ఉంది. వాటిని తొలగిస్తే పనులు పొందిన గుత్తేదారులు పనులు మొదలు పెట్టే అవకాశం ఉంటుంది. వారు ముందుకు రాకపోతే ఒప్పందాలను రద్దుచేసి ఇతరులకు అప్పగించేందుకు కూడా సాగునీటి శాఖ చర్యలు తీసుకునే అవకాశాలున్నాయి.

పనులు పూర్తయితే: గద్వాల మండల పరిధిలోని కొండపల్లి చెరువుపై రూ.9 కోట్లతో 900 మీటర్లు పొడవున నిర్మిస్తున్న అక్విడెక్ట్ పనుల అసంపూర్తిగా ఉండటం ఆయకట్టకు శాపమై కూర్చుంది. పనులు 90 శాతం పూర్తయ్యాయి. పది శాతం పడకేశాయి. కేవలం నాలుగు విద్యుత్తు స్తంభాలను తొలగించి వాటిని షిఫ్ట్ చేసి ఉంటే పనులు ఇప్పటికే పూర్తయ్యేవి. కానీ 2022 నుంచి అడ్డంకుల కారణంగా పనులు నిలిచిపోయాయి. 2022, మే నెలలో విద్యుత్తు స్తంభాలను తొలగించడానికి రూ.11 లక్షలను డిపాజిట్ చేస్తే పనులు ప్రారంభిస్తామని విద్యుత్తు శాఖ సమాధానం ఇచ్చింది. సాగునీటి శాఖ రూ.11 లక్షలను మంజూరు చేయకపోవడంతో అక్విడెక్ట్ నిర్మాణ పనులు నిలిచిపోయాయి.

ధరూర్, గద్వాల, ఇటిక్యాల మండలాల పరిధిలోని 76 కిలోమీటర్లు ఈ కాలువ నిర్మాణం ఉంటుంది. గుడ్డెందొడ్డి రిజర్వాయర్ పరిధిలో కాలువ పనులను 99, 100 ప్యాకేజీలు విభజించారు. 99 ప్యాకేజీలో భాగంగా ధరూర్ మండలంలోని రిజర్వాయర్ నుంచి 0- 36 కిలోమీటర్ల పొడవున అంటే గద్వాల మండలం కొండపల్లి శివారు వరకు, మిగిలిన 40 కిలోమీటర్ల పరిధిలోని పనులను 100 ప్యాకేజీ కింద విభజించారు. ఈ పనులు ఇటిక్యాల మండల పరిధిలోకి వస్తాయి. 100 ప్యాకేజీలో ప్రధాన కాలువ పనులు దాదాపుగా పూర్తయ్యాయి. 0- 36 కిలోమీటర్ల పరిధిలో గద్వాల మండలం కొండపల్లి గ్రామ సమీపంలో నిర్మించాల్సిన అక్విడెక్ట్ పనులు పూర్తయితే రెండు నియోజకవర్గాల పరిధిలో 65వేల ఎకరాలకు సాగునీరందుతుంది. త్వరగా విద్యుత్తు లైన్లు షిఫ్టింగ్ చేయాలని ఇప్పటికే విద్యుత్తు శాఖకు లేఖ రాశామని జూరాల ఎస్ఈ శ్రీధర్ 'న్యూస్‌టుడే'కు తెలిపారు.

పనుల పురోగతికి చర్యలు: మంత్రి దృష్టికి తీసుకెళ్లటంతో విద్యుత్తు లైన్ల షిఫ్టింగ్‌కు అవసరమైన నిధులు విద్యుత్తు శాఖకు అధికారులు జమచేశారు. వాటిని తొలగించిన వెంటనే మరో సారి మంత్రిని కలిపి పనులు పురోగతికి అవసరం ఉన్న నిధులు మంజూరు కోసం కృషి చేస్తాను.

-కృష్ణమోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే, గద్వాల

మంత్రిని కలిసి వివరిస్తాం: పనులు పూర్తికాకపోవటం వల్ల ఎక్కువగా నష్టపోతున్నది అలంపూరు నియోజకవర్గ రైతులే. ఈ నేపథ్యంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకొని పనులు మొదలయ్యేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకునేలా అధికారులపై ఒత్తిడి తెస్తాం. అవసరమైతే మంత్రిని కూడా కలిసి విన్నవిస్తాను.

-విజయుడు, ఎమ్మెల్యే, అలంపూర్

స్థానిక పోరుకు ముమ్మర ఏర్పాట్లు

జిల్లాలకు చేరిన కరదీపికలు


మహబూబ్‌నగర్ జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయానికి చేరిన ఎన్నికల మాడ్యుల్స్, కరదీపికలు

మహబూబ్‌నగర్ పట్టణం, న్యూస్‌టుడే : గ్రామ పంచాయతీ పాలకవర్గాలు, జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యుల పదవీ కాలం ముగిసింది. ప్రస్తుతం గ్రామ పంచాయతీ, జిల్లా పరిషత్తులు, మండల పరిషత్తుల్లో ప్రత్యేక అధికారుల పాలనలో ఉన్నాయి. ఆయా స్థానిక సంస్థలకు ఎన్నికలు ఎప్పుడు నిర్వహిస్తారన్న విషయంపై స్పష్టత లేకపోయినా అధికారులు ఎప్పుడు ఎన్నికల తేదీలని ప్రకటించినా నిర్వహించేందుకు వీలుగా ఏర్పాట్లలో తలమునకలయ్యారు. బ్యాలెట్ పెట్టెలను సరిచూసుకోవాలని ఎన్నికల సంఘం ఆదేశాలతో జిల్లాల వారిగా బ్యాలెట్ పెట్టెల ఆవశ్యకత, మరమ్మతులు చేసేవి ఎన్ని అనే వివరాలను అధికారులు సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల శిక్షణకు సంబంధించిన మాడ్యుల్స్, ప్రిసైడింగ్, రిటర్నింగ్ అధికారులకు సంబంధించిన కరదీపికలు జిల్లాలకు చేరాయి. వాటితో పాటు వివిధ రకాల ఫారాలు కూడా వచ్చాయి.

నాలుగు జిల్లాల్లో 6 కొత్త మండలాలు.. : ఉమ్మడి పాలమూరులోని నాలుగు జిల్లాల్లో కొత్తగా మండలాలు ఏర్పడ్డాయి. ఈసారి జడ్పీటీసీ, ఎంపీపీ ఎన్నికల్లో వీటిని పరిగణలోకి తీసుకుని మండల ప్రాదేశిక స్థానాలను పునర్విభజన చేయనున్నట్లు సమాచారం. తద్వారా రిజర్వేషన్లు కూడా మారనున్నాయి. జిల్లాలకు ఎన్నికల సామగ్రి చేరుతున్న నేపథ్యంలో బ్యాలెట్ పత్రాలు రావాల్సి ఉంది. మహబూబ్‌నగర్ జిల్లాలో కొత్తగా మహ్మదాబాద్, కౌకుంట్ల మండలాలు ఏర్పడ్డాయి. వనపర్తి జిల్లాలో ఏదుల, జోగులాంబ గద్వాల జిల్లాలో ఎర్రవల్లి, నారాయణపేట జిల్లాలో గుండుమాల్, కొత్తపల్లి ఇలా మొత్తం 6 కొత్త మండలాలు ఏర్పడ్డాయి. ఆయా ప్రాంతాల్లో ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలు పెరిగే ఆస్కారం ఉంది.

గోదాముల్లో ఎన్నికల సామగ్రి

ఉమ్మడి జిల్లాలో 1,700 పంచాయతీలు, 15,276 వార్డులు ఉన్నాయి. వచ్చే ఎన్నికల్లో వార్డుల సంఖ్య పెరగడంతో పాటు ప్రతి వార్డుకు ఒక బ్యాలెట్ పెట్టె అవసరం కానుంది. ఈ లెక్కన గతంలో మాదిరిగానే మూడు విడతల్లో ఎన్నికలు నిర్వహించనున్నారు. మొదటి విడతలో ఉపయోగించిన బ్యాలెట్ పెట్టెలను తిరిగి రెండో, మూడో విడత ఎన్నికల్లోనూ ఉపయోగించుకోవచ్చు. విధులు నిర్వహించే సిబ్బంది శిక్షణకు అవసరమైన పుస్తకాలు, సామగ్రి చేరుకోవడంతో వాటిని గోదాముల్లో భద్రపరిచారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

పోలింగ్ కేంద్రాలను అధికారులు పరిశీలించారు. ప్రస్తుతం ఉన్న కేంద్రాలు, వాటిలో సమస్యలు, కొత్తగా ప్రతిపాదించే కేంద్రాల్లో సమస్యలున్నాయా అనే దానిపై మండలాల వారీగా ఏర్పాటు చేసిన కమిటీలు పరిశీలించి ఇప్పటికే నివేదికను సమర్పించాయి. కొత్తగా మరికొన్ని పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసే అవకాశముంది. ప్రభుత్వం కుల గణనకు ఆదేశాలు జారీ చేయడం, దీనికి రెండు నెలలు గడవు ఇవ్వడంతో ఈ ఏడాదికి ఎన్నికలు లేనట్టేనని అధికారులు భావిస్తున్నారు. కులగణన పూర్తి చేసిన తర్వాత గత రిజర్వేషన్లను రద్దు చేసి కొత్తగా రిజర్వేషన్లను ప్రకటించి ఎన్నికలు నిర్వహించాలనే డిమాండ్ ఉంది. ప్రభుత్వం ఇప్పటివరకు ఎలాంటి ప్రకటన చేయకపోవటంతో ఉత్కంఠ నెలకొంది.

ఉమ్మడి జిల్లాలోని పంచాయతీలు, వార్డులు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, ఎంపీపీల సంఖ్య, ఓటర్ల వివరాలు ఇలా..

జిల్లా	పంచాయతీలు	ఎంపీటీసీలు	జడ్పీటీసీలు	ఎంపీపీలు	వార్డులు	పురుషులు	మహిళలు
మహబూబ్‌నగర్	441	168	16	16	3,836	2,57,529	2,58,647
నాగర్‌కర్నూల్	464	212	20	20	4,140	3,23,705	3,22,689
వనపర్తి	260	128	15	15	2,366	1,83,382	1,84,135
జోగులాంబ గద్వాల	255	141	13	13	2,390	1,91,313	1,96,875
నారాయణపేట	280	147	13	13	2,544	1,98,199	2,05,547

ఓటరు కార్డులు చిత్తు కాగితాలుగా..



గట్టు మండల పరిధిలోని తుమ్మల చెర్వు గ్రామంలో ఓటరు గుర్తింపు కార్డులు చిత్తుకాగితాలు కొనే వారికి అమ్మిన వైనం సామాజిక మాధ్యమాల్లో గురువారం చక్కర్లు కొట్టింది. గ్రామంలో ఓటర్లకు గుర్తింపు కార్డులు ఇవ్వకుండా వాటిని తమ వద్దే ఉంచుకొని ఇలా చేశారా, లేక ఎన్నికలు ముగిశాయి కాబట్టి ఎలాగో ఆలస్యం అయ్యింది చిత్తుకాగితాల కింద అమ్మేద్దాం అనుకున్నారో కానీ విచారణ చేస్తే వాస్తవాలు వెలుగుచూసే అవకాశం ఉంటుంది.

-న్యూస్‌టుడే, ధరూరు

సెస్ బిల్లులు కట్టేలా చర్యలు తీసుకోండి

గద్వాల గ్రామీణం, న్యూస్‌టుడే: జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల నుంచి పంచాయతీ కార్యదర్శులు సెస్ బిల్లులు కట్టేలా చర్యలు తీసుకోవాలని గ్రంథాలయాల సిబ్బందిని జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ నీలి శ్రీనివాసులు ఆదేశించారు. గురువారం గద్వాలలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో గ్రంథాలయాల సిబ్బందితో జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 9శాఖ గ్రంథాలయాలు, 4 గ్రామీణ గ్రంథాలయాలున్నాయని సిబ్బంది సమయ పాలన పాటించి విధులు నిర్వర్తించాలన్నారు. పోటీ పరీక్షల్లో భాగంగా నిరుద్యోగులను దృష్టిలో ఉంచుకుని జిల్లాకేంద్రం గద్వాలలోని గ్రంథాలయం ఉదయం 8గంటల నుంచి రాత్రి 8గంటల వరకు.. గ్రామీణ గ్రంథాలయాలు ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు నడిపించాలన్నారు. నిరుద్యోగుల కోసం అన్నిరకాల అధునాతన పుస్తకాలు తెప్పించాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ కార్యదర్శి శ్యామ్‌సుందర్, గ్రంథ పాలకులు రామాంజనేయులు, మాణిక్యమ్మ, సిబ్బంది శ్రీకాంత్, గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు ఏకరూప దుస్తులేవీ?

నెల రోజులైనా అంగన్‌వాడీలకు అందని వైనం


ననూరు అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులు

గద్వాల న్యూటౌన్, న్యూస్‌టుడే: అంగన్‌వాడీ కేంద్రాల చిన్నారులకు ఏకరూప దుస్తులు అందడంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. జిల్లాలో విద్యార్థులకు అవసరమైన దుస్తులు కుట్టి సిద్ధంగా ఉంచినా వాటిని అందించడంలో అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులతో పాటు అంగన్‌వాడీ కేంద్రాల చిన్నారులకు ఏకరూప దుస్తులు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఇందులో భాగంగానే జులై నెలలో జిల్లాకు వస్త్రం రాగా, డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో పొదుపు సంఘాల మహిళలు దుస్తులు సిద్ధం చేశారు. వాటిని జిల్లాలోని మాతా శిశు సంక్షేమ శాఖ అధికారులకు అందించి నెలకు పైగా గడిచింది. అయినా ఇంకా వాటిని చిన్నారులకు పంపిణీ చేయలేదు. సంబంధిత కార్యాలయంలోనే అవి మూలుగుతున్నాయి.

జిల్లాలో 8,222 మంది చిన్నారులు

గద్వాల జిల్లాలోని మల్దకల్, మానవపాడు, గద్వాల ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో మొత్తం 713 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. ఇందులో 8,222 మంది చిన్నారులు ప్రతి రోజూ కేంద్రాలకు వస్తున్నారు. వీరికి భోజనం, ఉడికించిన గుడ్లు, బాలామృతం వంటి పోషకాహారం అందించడంతో పాటు, పూర్వ ప్రాథమిక విద్యను బోధిస్తున్నారు. అయితే.. సర్కారు బడుల విద్యార్థులు ఏకరూప దుస్తులతో పాఠశాలకు వెళ్తుండగా, అంగన్‌వాడీ చిన్నారులు మాత్రం రంగుల దుస్తుల్లో వెళ్తున్నారు. దీనిని గుర్తించిన ప్రభుత్వం వీరికీ ఏకరూప దుస్తులు అందించాలని నిర్ణయించింది. ఈ మేరకు జిల్లాలోని చిన్నారుల కోసం మొత్తం 4,111 జతల ఏకరూప దుస్తులను కుట్టించారు. ఇదిలా ఉండగా పాఠశాల ప్రాంగణ పరిధిలో 175 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. ఇందులోని చిన్నారులకు మొదటి ప్రాధాన్యం ఇచ్చి ఏకరూప దుస్తులు పంపిణీ చేయాల్సి ఉండగా, ఇవ్వకపోవడంపై తల్లిదండ్రులు ఎప్పుడు ఇస్తారని టీచర్లను ప్రశ్నిస్తున్నారు.

ఆదేశాలు రావాలి

అంగన్‌వాడీ చిన్నారులకు అందించేందుకు ఏకరూప దుస్తులు సిద్ధంగా ఉన్నాయి. గతంలోనే డీఆర్‌డీఏ ద్వారా వాటిని అందించారు. ముఖ్యమంత్రి చేతుల మీదుగా ఈ కార్యక్రమాన్ని రాష్ట్రంలో మొదట ప్రారంభించిన తరువాత ఇవ్వాలని ఉన్నతాధికారులు చెబుతున్నారు. ప్రస్తుతానికి దుస్తులు అందించే విషయంపై ఉన్నతాధికారుల నుంచి ఎలాంటి ఆదేశాలు లేవు.

-సుధారాణి, డీడబ్ల్యూవో, గద్వాల

కేజీబీవీ పోస్టులకు 25న కౌన్సెలింగ్

గద్వాల అర్బన్ : జిల్లాలోని వివిధ కేజీబీవీలలో ఖాళీగా ఉన్న బోధన సిబ్బంది పోస్టులకు 1:1 నిష్పత్తిలో ఎంపికైన అభ్యర్థులు ఈ 25న జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు డీఈవో రవీందర్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అభ్యర్థులు తమ ఒరిజనల్ విద్యా ధ్రువపత్రాలతో హాజరుకావాలని సూచించారు. పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల వివరాలుdeojugulamba.weebly.com వెబ్ సైట్‌లో చూసుకోవచ్చని తెలిపారు.

పరిష్కారం కాని సాంకేతిక సమస్య

జడ్చర్ల, న్యూస్‌టుడే : సాంకేతిక సమస్య వల్ల నాలుగో రోజు కూడా వ్యవసాయ మార్కెట్లలో ఈ-నామ్ పద్ధతిలో టెండర్ల ప్రక్రియ జరగలేదు. ఉమ్మడి జిల్లాలోని వ్యవసాయ మార్కెట్లతో పాటు బాదేపల్లి వ్యవసాయ మార్కెట్‌లో గురువారం మ్యానువల్‌గా అధికారులు టెండర్ల ప్రక్రియ చేపట్టారు. 'ఇ-నామ్‌కు సాంకేతిక సంకటం' అనే శీర్షికతో 'ఈనాడు'లో కథనం ప్రచురితమైన విషయం పాఠకులకు విదితమే. ఈ విషయంపై రాష్ట్రవ్యాప్త మార్కెట్లలో అధికారులు, వ్యాపారులు, రైతుల్లో చర్చ కొనసాగింది. మార్కెట్ కార్యదర్శులు, జిల్లా మార్కెటింగ్ అధికారులు సమస్యను పరిష్కరించాలని ఉన్నత అధికారులకు లేఖలు రాశారు. సాంకేతిక సమస్య ఇంకా పరిష్కారం కాలేదని, జిల్లాలోని ఈ-నామ్ మార్కెట్లలో సాధారణ టెండర్ల ప్రక్రియతోనే పంట కొనుగోళ్లు చేపట్టినట్టు జిల్లా మార్కెటింగ్ అధికారి బాలమణి తెలిపారు.


తక్కువ నీటితో లాభదాయక పంటల సాగు

గద్వాల కలెక్టరేట్, మల్దకల్, న్యూస్‌టుడే: తక్కువ నీటితో ఎక్కువ దిగుబడులు వచ్చే పంటలను రైతులు సాగు చేయాలని జలశక్తి అభియాన్ టెక్నికల్ అధికారి మధుసూదన్ సూచించారు. గురువారం మల్దకల్ మండలం శేషంపల్లె గ్రామంలో సాగుచేస్తున్న ఉద్యానవన పంటలను పరిశీలించారు. బిందు సేద్యం పరికరాలతో వివిధ పంటను సాగుచేసి నీటిదుర్వినియోగాన్ని అరికట్టాలని పేర్కొన్నారు. జిల్లా ఉద్యానవశాఖ అధికారి అక్బర్, ఎంపీడీవో ఆంజనేయరెడ్డి, ఏపీవో సుజాత, తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో జల శక్తి అభియాన్ కార్యక్రమాన్ని అన్ని శాఖలు సమన్వయంతో విజయవంతం చేయాలని మధుసూదన్ సూచించారు. ఐడీవోసీలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో జల్‌శక్తి అభియాన్ క్యాచ్ ది రెయిన్ - 2024, నారీ శక్తి సే జలశక్తిపై జిల్లా ఇన్‌ఛార్జి అదనపు కలెక్టర్ నర్సింగ్‌రావుతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. . గత మార్చి నుంచి నవంబర్ 24 వరకు నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో మహిళలను భాగస్వాములను చేయాలని సూచించారు. అనంతరం సాగునీటి శాఖ, మిషన్ భగీరథ, జిల్లా గ్రామీణాభివృద్ధి, అటవీశాఖ అధికారులు పీపీటీ ద్వారా ప్రజెంటేషన్ ద్వారా చూపించిన పనుల పట్ల సంతృప్తికి వ్యక్తం చేశారు. జడ్పీ సీఈవో కాంతమ్మ, డీపీవో శ్యాంసుందర్, శ్రీధర్‌రెడ్డి, రహీముద్దీన్, దామోదర్‌రావు, మోహన్ తదితరులు పాల్గొన్నారు.


శేషంపల్లెలో పల్లెప్రకృతి వనాన్ని పరిశీలిస్తున్న అధికారులు

విద్యుత్తు శాఖా మేలుకో..



ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా చాలా గ్రామాల్లో విద్యుత్తు స్తంభాలు, తీగల పరిస్థితి ఘోరంగా ఉంది. ఏ మాత్రం గాలివీచినా తీగలు తెగి ప్రమాదాలకు తావిచ్చేలా ఉన్నాయి. నారాయణపేట జిల్లా ఊట్కూరు మండలం తిప్రాసుపల్లిలో ఓ రైతు పొలంలో కనిపించిన చిత్రమిది. విద్యుత్తు స్తంభాల మధ్య దూరం ఎక్కువగా ఉండటంతో కర్రలు దన్నుగా ఉంచి తీగలు వేలాడకుండా ఆ రైతు ఏర్పాటు చేసుకున్నారు.

- న్యూస్‌టుడే, నారాయణపేట

చక్కని జీవన శైలితోనే ఆరోగ్యం పదిలం

● మధుమేహం, గుండె, ఈఎన్‌టీ సమస్యలపై వైద్యుల సూచనలు

ఈనాడు ఈటీవీ తెలంగాణ అవగాహన సదస్సుకు అనూహ్య స్పందన



ఆరోగ్య అవగాహన సదస్సుకు హాజరైన జనం

న్యూస్‌టుడే, పాలమూరు : అప్రమత్తత, చక్కని జీవన శైలితోనే వ్యాధులకు దూరంగా ఉంటూ ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని వైద్య నిపుణులు తెలిపారు. మహబూబ్‌నగర్‌లోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో 'ఈనాడు - ఈటీవీ' ఆధ్వర్యంలో గురువారం ఆరోగ్య అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు సీనియర్ సిటిజన్లు, మహిళలు, యువత ఇలా.. అన్ని వర్గాల నుంచి అనూహ్య స్పందన లభించింది. చెవి, ముక్కు, గొంతు సంబంధ వ్యాధులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మహబూబ్‌నగర్ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.సంపత్‌కుమార్ సింగ్, మధుమేహం, ఇతర అనారోగ్యాలపై ప్రముఖ ఫిజీషియన్ డా.శ్రీనివాస్‌రెడ్డి, గుండె జబ్బులపై కార్డియాలజిస్ట్ డా.మహేశ్‌బాబు అవగాహన కల్పించటంతో పాటు సందేహాలు నివృత్తి చేశారు. చాలా ఏళ్లుగా మధుమేహంతో బాధపడుతున్న తాము ఇన్సులిన్ తీసుకుంటున్నామని, ఇది ప్రమాదకరమా అని కొందరు అడగగా అదేమీ కాదని, మాత్రల కంటే ఇదే నయమని వైద్యులు తెలిపారు. నిద్ర సమస్య ఉందని కొందరు చెప్పగా తగినంత శారీరక శ్రమ ఉంటే తప్పక నిద్ర వస్తుందన్నారు. ఐదేళ్ల నుంచి గొంతు కింద పెద్ద గడ్డతో బాధపడుతున్నానని ఒకరు చెప్పగా జనరల్ ఆసుపత్రికి వస్తే చికిత్సలు అందిస్తామన్నారు. అనారోగ్యం వచ్చినప్పుడు వైద్యులను సంప్రదించకుండా నేరుగా మాత్రలు కొన్నుకుని, సామాజిక మాధ్యమాల్లో దొరికే సమాచారంతో సొంత వైద్యం చేసుకోవద్దని, ఇది చాలా ప్రమాదకరమని హెచ్చరించారు. ఉరుకులు, పరుగుల జీవితంలో ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరూ రోజూ 6 నుంచి 7 గంటలు నిద్ర పోవటంతో పాటు గంట పాటు వ్యాయామం చేయాలని, పోషకాహారం తీసుకోవడం, చెడు అలవాట్లకు దూరంగా ఉండటం, ఒత్తిడి లేకుండా జీవించడం అవసరమని తెలిపారు.

పిండి పదార్థాలు తక్కువ తీసుకోవాలి



ప్రపంచంలోనే అత్యధిక మధుమేహం (డయాబెటిక్) బాధితులతో ఈ వ్యాధికి భారత్ రాజధానిగా మారింది. కార్బోహైడ్రేట్లు (పిండి పదార్థాలు) ఎక్కువగా ఉండే తెల్ల అన్నం, దుంపలు ఆహారంగా తీసుకునే అలవాటు ఉండటమే కారణం. గతంలో 40 ఏళ్ల తర్వాత ఈ వ్యాధి వచ్చేది. ఇప్పుడు 25 ఏళ్ల వారికి కూడా టైప్-2 వ్యాధి వస్తోంది. ఒత్తిడి, మానసిక సమస్యలతో సతమతం కావటం, కీళ్లు, ఇతర నొప్పుల మందులు, స్టెరాయిడ్స్ ఎక్కువగా వాడటం వల్ల కూడా వ్యాధి బారిన పడుతున్నారు. మధుమేహం వల్ల కంటి రెటీనా కూడా దెబ్బతింటుంది. గుండె, మూత్రపిండాలు, కాలేయం, నరాల బలహీనతలు, మంటల తదితర సమస్యలు, వస్తాయి. ఇన్‌ఫెక్షన్లు సోకుతాయి. మధుమేహం తీవ్రత ఎక్కువగా ఉన్నవారు ఇన్సులిన్ తీసుకోవాలి. ప్రతి ఆరు నెలలకు ఒకసారి రక్త పరీక్షలు చేయించుకుంటూ ఆరోగ్యం విషయంలో అప్రమత్తంగా ఉండాలి. కార్బోహైడ్రేట్లు ఉండే ఆహారం చాలా తక్కువగా తినాలి. మద్యం, ధూమపానానికి దూరంగా ఉండాలి. ఆరోగ్యం కోసం, మధుమేహం నియంత్రణకు రోజూ 5 కి.మీ.ల మేర నడవటం చాలా ముఖ్యం.

- డా.శ్రీనివాస్‌రెడ్డి, ప్రముఖ ఫిజీషియన్

చెవిలో ఏది పడితే అది పెట్టకూడదు..



చెవి ద్వారా వినటమే కాదు దానితో పనులు జరుగుతాయి. అది చాలా సున్నితమైంది. చాలా మంది చెవిలో దురదగా అనిపిస్తే వెంటనే ఇయర్ బడ్స్, పుల్లలను పెట్టి అందులో ఉన్న వ్యర్థాలు బయటకు తీయడానికి ప్రయత్నిస్తారు. అలా చేయడం ఎంత మాత్రం మంచిది కాదు. వయస్సు పెరిగే కొద్దీ వినికిడి లోపాలు వస్తుంటాయి. ఈ సమస్యను అధిగమించేందుకు ప్రస్తుతం అనేక పరికరాలు అందుబాటులోకి వచ్చాయి. చిన్నపిల్లల్లో టాన్సిల్స్ వస్తుంటాయి. తర్వాత తగ్గిపోతాయి. ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. చదువులో వెనకబడుతున్న చిన్నారుల్లో వినికిడి సమస్యలు కూడా ఉండే అవకాశం ఉంటుంది. పిల్లల్లో సమస్య ఉన్నట్లు గుర్తిస్తే వెంటనే చికిత్సలు చేయించాలి. చిన్నారులు సపోటా, శీతాఫలాలు వంటివి తినే క్రమంలో వాటి గింజలు కూడా మింగే అవకాశం ఉంటుంది. అవి శ్వాస నాళికలోకి వెళ్లి అడ్డుపడితే ప్రాణాలు కూడా పోయే ప్రమాదం ఉంటుంది. పసివాళ్లకు ఇలాంటి గింజలు అందుబాటులో ఉండకుండా పడేయాలి. నోటి క్యాన్సర్ రాకుండా నోటిని శుభ్రంగా ఉంచుకోవాలి. నోటిలో పుండు ఎక్కువ కాలం మానకపోతే ఈఎన్‌టీ వైద్యుడిని సంప్రదించాలి. మహబూబ్‌నగర్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలోని ఈఎన్‌టీ విభాగంలో అత్యాధునిక వైద్య పరికరాలు అందుబాటులోకి తీసుకొచ్చాం. అన్ని రకాల చికిత్సలు అందిస్తాం. సద్వినియోగం చేసుకోవాలి.

- డా.సంపత్‌కుమార్ సింగ్, ఈఎన్‌టీ విభాగాధిపతి, జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్, మహబూబ్‌నగర్

బరువు పెరిగితే గుండెపై ఒత్తిడి..



బరువు అధికంగా పెరగడం వల్ల గుండెపై ఒత్తిడి పెరిగి హృద్రోగ సమస్యలు ఉత్పన్నమవుతాయి. ధూమపానం కూడా గుండె వ్యాధులకు దారితీస్తుంది. మహిళలతో పోలిస్తే గుండె జబ్బులు, మరణాలు పురుషుల్లోనే ఎక్కువ ఉంటాయి. రుతుస్రావం వల్ల మహిళలు ఆరోగ్యంగా ఉంటారు. నేడు అత్యాధునిక వైద్య సదుపాయాలు అందుబాటులోకి రావటంతో గుండెపోటు వచ్చిన వారిలో 99 శాతం మంది బతుకుతున్నారు. బొడ్డు పైభాగం నుంచి గొంతు కింది భాగం వరకు గతంలో వచ్చిన నొప్పి కాకుండా కొత్త రకమైన తీవ్రమైన నొప్పి వస్తే అది గుండెపోటుకు సంకేతంగా భావించి వెంటనే అప్రమత్తం కావాలి. ఆయాసం, కళ్లు తిరగడం, చెమటలు ఎక్కువగా రావడం తదితర లక్షణాలు కూడా కనిపిస్తాయి. గుండెపోటు వచ్చిన మూడు నిమిషాల్లో వారికి సీపీఆర్ ప్రారంభించాలి. వెంటనే డిస్ప్రిన్ టాబ్లెట్ నాలుక కింద పెడితే గుండెపోటు తీవ్రతను తగ్గించడానికి ఎంతో ఉపయోగపడుతుంది. ఆ వెంటనే సమీపంలో ఉన్న ఆసుపత్రికి తరలించి వైద్యులకు చూపించి చికిత్సలు ప్రారంభిస్తే ప్రాణాలను నిలబెట్టవచ్చు.

- డా.మహేశ్‌బాబు

భిన్న రీతిలో ఫ్లెక్సీలు



టైరోడ్ వద్ద గురువారం మధ్యాహ్నం ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

కృష్ణా, న్యూస్‌టుడే : ఏడాది క్రితం తమ కుమార్తె విజయలక్ష్మి ఆత్మహత్య చేసుకుందని, అందుకు అల్లుడు, అత్తమామలే కారణమని నారాయణపేట జిల్లా కృష్ణా మండలం గుడేబల్లూరుకు చెందిన చెన్నయ్యగౌడ్ ఆరోపించారు. నిందితుల ఆచూకీ తెలియచేయాలని కోరుతూ విభిన్న రీతిలో కృష్ణా మండలం టైరోడ్, మక్తల్, మరికల్, మహబూబ్‌నగర్‌లలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. గత ఏడాది కర్ణాటక రాష్ట్రంలోని సేడం తాలూకా శంకరపల్లిలో తమ కుమార్తె ఆత్మహత్యకు పాల్పడగా అక్కడి పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని తెలిపారు. అత్తమామలు గ్రామం విడిచి వెళ్లిపోయారని తెలిపారు. వివాహ సమయంలో తమ కుమార్తెకు ఇచ్చిన కట్నకానుకలు తిరిగి ఇస్తామని చెప్పి ఇప్పుడు కనిపించకుండా పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆచూకీ కోసం తెలంగాణ, కర్ణాటకలలో వెయ్యి బ్యానర్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

వైభవంగా సీతారాముల కల్యాణం




సీతారాముల కల్యాణం జరిపిస్తున్న పండితులు

ఇటిక్యాల, న్యూస్‌టుడే: పవిత్ర పుణ్యక్షేత్రమైన బీచుపల్లిలో గురువారం సీతారాముల కల్యాణంను వైభవంగా జరిపించారు. స్వామి జన్మనక్షత్రమైన పునర్వసును పురస్కరించుకుని కోదండ రామాలయంలో కల్యాణోత్సవం ఏర్పాటు చేశారు. తిలకించేందుకు భక్తులు జిల్లా నలుమూలల నుంచి బీచుపల్లికి తరలివచ్చారు. ఆలయ పండితుల వేద మంత్రోచ్ఛారణలు, భక్తుల కోలాహలం, భాజాభజంత్రీల నడుమ కల్యాణం కమనీయంగా జరిపించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అన్నదానం ఏర్పాటు చేశారు. ఆలయ మేనేజర్ సురేందర్ రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

దందా వెనక ఆ ముగ్గురు!



జీరో ఇసుక పేరుతో అక్రమం



తుమ్మిళ్ల రీచ్ వద్ద ఇసుక నిల్వలు

గద్వాల కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్‌లో జీరో ఇసుక పాలసీ సరిహద్దులోని గద్వాల జిల్లాలో కాసులు కురిపిస్తోంది. రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన ఇసుకాసురులు ఏకమై అధికారుల అండదండలతో జీరో ఇసుక పాలసీని ఇక్కడ యథేచ్ఛగా అమలు చేస్తూ రూ.కోట్లు దండుకుంటున్నారు. వెనుక గద్వాల జిల్లాకు చెందిన అధికారపార్టీ బడా నాయకుడి భరోసా, అధికారుల అండదండలు పుష్కలంగా ఉన్నట్టు సమాచారం. సరిహద్దు గుండా ఒక ఇసుక టిప్పర్ జిల్లాలోకి అడుగు పెడితే అధికార పార్టీ నేతలు నెలకు రూ.లక్ష వరకు వసూలు చేస్తున్నారని ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. కర్నూల్ పట్టణానికి చెందిన ఓ వ్యక్తి, అలంపూర్ పట్టణానికి చెందిన అధికార పార్టీ నాయకుడు, ఎర్రవల్లి చౌరస్తాలో ఓ యువకుడు ఇందులో ప్రధాన భాగస్వాములని తెలుస్తోంది.

అధికార పార్టీ నాయకుడి హస్తం : జిల్లాలో అధికారికంగా ఇసుక తవ్వకాలు జరగడం లేదు. ఇసుక తవ్వకానికి కాంట్రాక్టు దక్కించుకున్న కాంట్రాక్టర్‌కు అధికార పార్టీ నాయకుడికి మధ్య కమీషన్ల విషయంలో వివాదం ఏర్పడటంతో ఐదు నెలలుగా తవ్వకాలు నిలిచిపోయాయి. ఈ క్రమంలో మన ఇసుక, మన వాహనం కింద దరఖాస్తు చేసుకున్న వారికి ఇసుక దొరకడం లేదు. తుమ్మిళ్ల రిచ్ వద్ద 40వేల టన్నుల ఇసుక అంటే సుమారు 2 వేల టిప్పర్ల ఇసుక డంపుల రూపంలో అందుబాటులో ఉండటంతో, ఈ ఇసుక కోసం 150 టిప్పర్ల యజమానులు మన ఇసుక, మన వాహనం కింద ప్రభుత్వానికి సొమ్ములు చెల్లించి నెలలు గడిచినా అందడం లేదు. మరోవైపు సరిహద్దుల గుండా బ్లాక్ మార్కెట్లో ఇసుక సులభంగా దొరుకుతోంది. అధికారికంగా ఇసుక డంపులు అందుబాటులో ఉన్నా, నిర్మాణదారులకు ఎందుకు అందడం లేదో అంతు చిక్కని విషయం. ఈ తతంగం వెనుక బడానాయకుడి హస్తం ఉన్నట్లు బహిరంగంగానే ఆరోపణలు వినిపిస్తున్నాయి. జిల్లా ఉన్నతాధికారులు మన ఇసుక, మన వాహనం కింద విక్రయించడానికి మీనమేషాలు లెక్కిస్తుండటం కూడా అనుమానాలకు తావిస్తోంది. మన ఇసుక, మన వాహనం కింద టన్ను ఇసుక రూ. వెయ్యి కాగా, బ్లాక్‌లో టన్ను ఇసుకను దళారులు రూ.2,800 లకు విక్రయిస్తూ రోజూ లక్షలు ర్జిస్తున్నారనే నిర్మాణ రంగంలో ఉన్న పలువురు అంటున్నారు. గద్వాల పట్టణానికి రోజుకు 6 నుంచి 10 టిప్పర్లు (ఒక్కో టిప్పర్‌లో 30 నుంచి 42 టన్నులు) ఇసుక రవాణా అవుతోంది.

చేస్తున్నారు ఇలా..

తుంగభద్ర నది అవతలి వైపున ఉన్న కర్నూల్ పట్టణ శివారు ప్రాంతాల నుంచి కర్నూల్ పట్టణానికి చెందిన ఓ వ్యక్తి ఎర్రవల్లి చౌరస్తాకు చెందిన వ్యక్తికి మధ్య ఉన్న అవగాహన ప్రకారం ఆంధ్రప్రదేశ్ సరిహద్దుల నుంచి తెలంగాణ సరిహద్దు అయిన గట్టు మండలంలోని బల్గెర వరకు టిప్పర్‌ను తీసుకుని వస్తారు. అక్కడి నుంచి ధరూర్ మీదుగా గద్వాల పట్టణానికి ఆ టిప్పర్ చేరుకునే విధంగా పక్కా ప్లాన్‌తో సరఫరా చేస్తున్నారని సమాచారం. పదిహేను రోజుల కిందట ఇలా మంత్రాలయం నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న టిప్పర్‌ను ధరూర్ పోలీసులు పట్టుకున్నట్లు సమాచారం. కృష్ణానది అవతలివైపునున్న వనపర్తి జిల్లాలోని రంగాపురం, రాంపురం గ్రామాల నుంచి పెద్ద ఎత్తున ఇసుక అక్రమంగా గద్వాల పట్టణానికి రవాణా జరుగుతోంది. ఎర్రవల్లి చౌరస్తాకు చెందిన ఓ యువకుడు ఇందులో కీలక సూత్రధారి. టీఎస్ఎండీసీ ప్రాజెక్టు అధికారి రంగారెడ్డి వివరణ కోసం సంప్రదించగా అందుబాటులోకి రాలేదు.

'బెటాలియన్లు కావు.. రాచరికపు బంధిఖానాలు'



ఎర్రవల్లిచౌరస్తాలో ర్యాలీ నిర్వహిస్తున్న పదో పటాలం పోలీసు కుటుంబాలు

ఇటిక్యాల, న్యూస్‌టుడే: 'ఇవి బెటాలియన్లు కావు రాచరికపు బంధిఖానాలు' అంటూ ప్రత్యేక పోలీసు కుటుంబాలు ఆందోళన వ్యక్తం చేశాయి. ఎర్రవల్లిచౌరస్తాలోని పదో పటాలంలో పనిచేసే పోలీసు కుటుంబాలలో కొందరు గురువారం సాయంత్రం ఒకే రాష్ట్రం.. ఒకే పోలీసు విధానం తీసుకురావాలంటూ ఎర్రవల్లిచౌరస్తాలోని జాతీయ రహదారిపై ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. 20 నిమిషాల పాటు జాతీయ రహదారిపై నిరసన తెలిపిన కుటుంబీకులకు ఇటిక్యాల, కోదండాపురం ఎస్ఐలు వెంకటేశ్, స్వాతి నచ్చచెప్పి నిరసన విరమింపజేశారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. నెలలో 26 రోజులు డ్యూటీలు వేస్తుండటంతో కుటుంబాలు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై పటాలంలో ఉన్నతాధికారులకు పలుమార్లు విన్నవించినా న్యాయం జరగలేదన్నారు. సివిల్, ఏఆర్‌లాగా ఒకే దగ్గర ఐదు సంవత్సరాలు డ్యూటీలు ఉంటూ కుటుంబాలను చూసుకునేలా మార్పులు తేవాలంటూ వారు డిమాండ్ చేశారు.

ఎగువ జూరాలలో సాంస్కృతిక పోటీలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఈ సూరిబాబు, చిత్రంలో సీఈ రామసుబ్బారెడ్డి


ఆత్మకూరు, న్యూస్‌టుడే: ఎగువ జూరాల జల విద్యుత్తు ఉత్పత్తి కేంద్రంలో గురువారం టీఎస్ జెన్‌కో రాష్ట్ర స్థాయి సాంస్కృతిక పోటీలు ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు ఈ పోటీలు కొనసాగుతాయి. ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని ఉద్దేశించి జెన్‌కో సీఈ రామసుబ్బారెడ్డి, ఎస్ఈ సూరిబాబు మాట్లాడారు. ఉద్యోగులకు విధుల నిర్వహణతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు మానసిక ఉల్లాసాన్ని, ఉత్సాహాన్ని కలిగిస్తాయని పేర్కొన్నారు. రాష్ట్రంలోని ఆయా ప్రాంతాలకు చెందిన పది విద్యుత్తు ఉత్పత్తి కేంద్రాల నుంచి 70 మంది అధికారులు, ఉద్యోగులు ఈ పోటీలకు హాజరయ్యారని తెలిపారు.

తెగిపడిన హెచ్‌టీ తీగలు

కాలిన ఫ్యాన్లు, మీటర్లు ● ఒకరికి గాయాలు



జావిద్ కాలికి గాయాలు



జక్లేర్‌లో దగ్ధమైన మీటర్లు

మక్తల్ గ్రామీణం, న్యూస్‌టుడే: హెచ్‌టీ విద్యుత్తు లైన్ తీగలు తెగి పడిన ఘటన మక్తల్ మండలం జక్లేర్ స్టేజీ వద్ద గురువారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. జావిద్ ఇంటి ముందు ఉన్న హెచ్‌టీ లైన్ తీగలు తెగి ఎల్‌టీ లైన్‌పై పడిపోవడంతో షార్ట్ సర్క్యూట్ ఏర్పడింది. ఆ ప్రాంతంలోని నివాస గృహాల్లో 12 ఫ్యాన్‌లు, 10 విద్యుత్తు మీటర్లు కాలిపోయాయి. తీగపడిన క్రమంలో తూలిపడిన జావిద్‌కు గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే విద్యుత్తు ఉపకేంద్రానికి సమాచారం ఇచ్చి, సరఫరా నిలిపివేయించారు. ఈ ఘటనపై విచారణ చేస్తామని విద్యుత్తు శాఖ ఏఈ రామకృష్ణ తెలిపారు.

ఆత్మహత్యకు యత్నించిన బాలిక మృతి


సీడ్ ఆర్గనైజర్‌పై కేసు

మల్దకల్, న్యూస్‌టుడే: బంగారం దొంగతనం చేసిందనే నెపంతో బాలిక (17)ను మల్దకల్ ఠాణాకు పిలిపించి విచారించగా ఆ అవమానం భరించలేక ఆమె పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన విషయం తెలిసిందే. కాగా బాలిక చికిత్సపొందుతూ గురువారం మృతిచెందింది. ఎస్సై నందికర్ తెలిపిన వివరాల ప్రకారం.. మల్దకల్ మండలం బిజ్వారం గ్రామానికి చెందిన బాలిక ఈ సంవత్సరం మార్చి నెల నుంచి గద్వాలలోని బండ్ల రాజశేఖర్‌రెడ్డి ఇంట్లో పనులు చేయడానికి చేరింది. ఆగస్టు నెలలో తన ఇంట్లో బంగారు గొలుసు పోయిందని దానిని బాలిక దొంగతనం చేసిందని అనుమానం వ్యక్తం చేసి అడిగారు. ఆ తర్వాత గొలుసు ఇంట్లోనే దొరికిందని చెప్పారు. తిరిగి అక్టోబరు 11న గొలుసు దొంగతనం చేసిందని మల్దకల్ ఠాణాలో రాజశేఖరరెడ్డి ఫిర్యాదు చేయగా పోలీసులు బాలికను, తల్లిని ఠాణాకు పిలిపించి విచారించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. బాలిక అవమానం భరించలేక బిజ్వారంలో పురుగు మందుతాగి ఆత్మహత్యకు యత్నించింది. చికిత్స నిమిత్తం గద్వాలకు అనంతరం కర్నూలుకు తరలించారు. చికిత్స పొందుతూ గురువారం బాలిక మృతిచెందినట్లు ఎస్సై తెలిపారు. బాలిక తల్లి కవిత ఫిర్యాదు మేరకు సీడ్‌ఆర్గనైజర్ రాజశేఖరరెడ్డిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నందికర్ వివరించారు.

చికెన్ ధరలు

ఫాంరేటు	120-00
రిటైల్	142-00
డ్రెస్డ్	206-00
స్కిన్‌లెస్	234-00

ఇథనాల్ పరిశ్రమ పనులు అడ్డుకున్న ప్రజలు



పనులను అడ్డుకునేందుకు వచ్చిన గ్రామస్థులు

రాజోలి, న్యూస్‌టుడే: మా అభిప్రాయం తీసుకోకుండా ఇథనాల్ పరిశ్రమ ఎలా ఏర్పాటు చేస్తారంటూ పరిసర గ్రామాల ప్రజలు పనులను అడ్డుకున్న సంఘటన గద్వాల జిల్లా రాజోలి మండలంలో గురువారం చోటుచేసుకుంది. గాయత్రి సంస్థ వారు పెద్ద ధన్వాడ గ్రామ శివారులో రైతుల నుంచి 25 ఎకరాల వ్యవసాయ భూమిని కొనుగోలు చేసి పరిశ్రమ ఏర్పాటుకు సన్నద్ధమయ్యారు. పరిశ్రమ ఏర్పాటుకు తీసుకున్న భూమి పక్కనే దళితులకు ప్రభుత్వం ఇచ్చిన భూమి 152 ఎకరాలు ఉంది. వీటితో పాటు చుట్టుపక్కల రైతులు వ్యవసాయం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో వారం రోజుల కిందట పరిశ్రమ పనులు చేపట్టేందుకు రాగా ఆయా గ్రామాల ప్రజలు అడ్డుకున్నారు. తిరిగి గురువారం సంబంధిత సంస్థ వారు పరిశ్రమకు అవసరమైన విద్యుత్తు స్తంభాలను, జేసీబీ, టిప్పర్, కంకర తీసుకురావడంతో పాటు గుడారాలను ఏర్పాటుచేశారు. విషయం తెలుసుకున్న పెద్ద ధన్వాడ, చిన్న ధన్వాడ, నసనూర్, మాన్‌దొడ్డి, చిన్నతాండ్రపాడు, నౌరోజి క్యాంపు ప్రజలు సంఘటన స్థలానికి చేరుకుని పనులను అడ్డుకుని సంస్థ సిబ్బందితో వాగ్వాదం చేశారు. సీఐ టాటాబాబు, తహసీల్దార్ రాంమోహన్, ఎస్సై జగదీష్ ప్రజలను నిలువరించి మాట్లాడారు. సంస్థ వారు అనుమతులు చూపకుండా పనులు ఎలా చేపడతారంటూ అధికారులను ప్రశ్నించారు. కాగా పరిశ్రమ ఏర్పాటుకు తమకు అన్ని అనుమతులున్నాయని సంస్థ వారు తెలిపినప్పటికీ వాటిని చూపకపోవడంతో పనులు నిలిపి వేసి వెళ్లిపోవాలని డిమాండు చేశారు. సీఐ, తహసీల్దార్ సంస్థ ప్రతినిధులతో మాట్లాడి అనుమతులు చూపించి పనులు ప్రారంభించాలని సూచించగా వారు పనులు ఆపేశారు. పరిశ్రమ ఏర్పాటు చేయకుండా చూడాలని ఈ సందర్భంగా ప్రజలు అధికారులకు వినతిపత్రాలు అందజేశారు.

రాయపురం క్వారీలో పేలుళ్లు: ఇద్దరికి గాయాలు



రాయి తగిలి గాయాలు

గద్వాల, న్యూస్‌టుడే: గట్టు మండలం రాయపురం శివారులో 199 సర్వే నంబర్‌లో భారత మాల పనుల కోసం క్వారీలో పేలుళ్లు జరపగా పక్కనే పొలంలో పనిచేసుకుంటున్న ఇద్దరికి గాయాలయ్యాయి. బాధితుల కథనం మేరకు.. గురువారం సాయంత్రం 5 గంటల ప్రాంతంలో క్వారీలో పేలుళ్లు జరపటంతో బండరాళ్లు ఎగిసి పడి హరిజన తిమ్మప్ప కుమారుడు నవీన్, మరదలు పద్మమ్మకు గాయాలయ్యాయి. ఎలాంటి సమాచారం లేకుండా పేలుళ్లు జరపటంతో పక్కనే పొలంలో వ్యవసాయ పనులు చేసుకుంటున్న వారు గాయపడ్డారని గట్టు పోలీసు ఠాణాలో ఫిర్యాదు చేసినట్లు తిమ్మప్ప వివరించారు. పేలుళ్లకు అనుమతులున్నాయో లేదో తమకు తెలియదని, చుట్టు పక్కల రెండు కి.మీ. దూరం వరకు ప్రజలు, రైతులను అప్రమత్తం చేయాల్సిన బాధ్యత కంపెనీ ప్రతినిధులదని, ఆదేదీ చేయకుండా పేలుళ్లు నిర్వహించటం వల్లే ఇలాంటివి జరుగుతున్నాయని వారు వాపోయారు. ఈనెల 21 తేదీ నుంచి క్వారీలో బ్లాస్టింగ్ చేస్తున్నామని కంపెనీ ప్రతినిధులు సమాచారం ఇచ్చారని, సాయంత్రం 3 గంటల నుంచి ఐదు గంటల ప్రజలు అప్రమత్తంగా ఉండేలా సమాచారం ఇవ్వాలని ఆదేశాలు ఇచ్చామని తహసీల్దార్ సరితారాణి పేర్కొంటున్నారు.

తెరపై ఈనాడు

గద్వాల: ఎస్వీఎస్ సినిమాస్... **దేవర, విశ్వం, జనక అయితే గనక, లగ్గం, వీనమ్,** **అయిజ:** శివసాయి : **దేవర** భువనేశ్వర్ : **సముద్రుడు,** మాధవ్ : **వేట్టయన్**
–న్యూస్‌టుడే, గద్వాల గ్రామీణం, అయిజ


క్షేత్రస్థాయిలో పనిచేసే ఉద్యోగులే కీలకం

సమాచార సేకరణలో శిక్షణ సివిల్ సర్వీస్ అధికారులు



మల్దకల్‌లో మహిళాసంఘాలతో సమావేశంలో సివిల్ సర్వీస్ శిక్షణ అధికారులు

ఇటిక్యాల, మానవపాడు, ఉండవల్లి, ధరూరు, మల్దకల్, అలంపూర్, న్యూస్‌టుడే: క్షేత్రస్థాయిలో పనిచేసే ఉద్యోగులే కీలకమని సివిల్ సర్వీస్ శిక్షణ అధికారులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. గురువారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీ, ప్రాథమిక పాఠశాల, పశువైద్యశాలలను పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. ఇటిక్యాల ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసి పథకం అమలు తీరును తెలుసుకున్నారు. ● మానవపాడు మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో వివిధ శాఖల మండల అధికారులతో సివిల్ సర్వీస్ శిక్షణ అధికారులు సమావేశమయ్యారు. శాఖల వారీగా అమలవుతున్న పథకాలు, పనితీరు తదితర వివరాలు తెలుసుకున్నారు. అనంతరం కేజీబీవీని సందర్శించారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ● ఉండవల్లిలో గ్రామపంచాయతీ, వ్యవసాయ, ఎంపీడీవో కార్యాలయం, పల్లెదవాఖాన, ఠాణా, పశు వైద్యశాల, సెగ్రిగేషన్‌షెడ్డు, వైకుంఠధామం, జడ్పీ ఉన్నత పాఠశాల, రేషన్ దుకాణం, శుద్ధజల కేంద్రాన్ని సందర్శించారు. గ్రామ పంచాయతీలో దస్త్రాల పరిశీలన, చెత్తశుద్ధి కేంద్రంలో తడి, పొడి చెత్త సేకరణతో వచ్చే ఆదాయం గురించి ఆరా తీశారు. రైతులు పండించే పంటల మార్కెటింగ్ గురించి తెలుసుకున్నారు. పల్లెదవాఖానలో ప్రజలకు, గర్భిణులకు అందించే వైద్యసేవల గురించి, ఉచిత మందుల పంపిణీ వివరాలు తెలుసుకున్నారు. ఠాణాలో కేసుల వివరాలు, లాకప్ గది గురించి తెలుసుకున్నారు. జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో ముచ్చటించి విద్యా సామర్థ్యాలను పరిశీలించి, చదువులో ఉన్నతంగా రాణించాలన్నారు. ● ధరూరు మండల కేంద్రంలో పర్యటించారు. ప్రభుత్వ వైద్య అస్పత్రితో పాటు పంచాయతీ కార్యాలయం, గ్రామ నర్సరీలు, మౌలికంగా కల్పించిన వసతులను పరిశీలించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో మండల భౌగోళిక స్వరూపం, అందుబాటులో ఉన్న నీటి వనరులు, పర్యావరణ పరిస్థితులపై ఎంపీడీవో మంజులను అడిగి తెలుసుకున్నారు. ధరూరు ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో ముచ్చటించారు. ● మల్దకల్‌లో మహిళా సంఘాల సభ్యులతో ముఖాముఖి చర్చించారు. తహసీల్దార్ కార్యాలయంలో ధరణిపోర్టల్ వ్యవస్థ, మహిళా సమాఖ్య భవన్‌లో మహిళా సంఘాలు, పాఠశాల విద్యార్థులు, మేజర్‌గ్రామపంచాయతీ, రైతువేదిక, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అధికారులతో ముఖాముఖి మాట్లాడారు. అనంతరం ఆదిశిలాక్షేత్రాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ● అలంపూర్ ఆలయాలను శిక్షణ అధికారులు దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు, సిబ్బంది స్వాగతం పలికారు. స్వామి, అమ్మవార్లను దర్శించుకుని పూజలు నిర్వహించారు. అంతకుముందు అలంపూర్ పురపాలిక కార్యాలయాన్ని శిక్షణ అధికారులు సందర్శించారు. వారికి కమిషనర్ సరస్వతీ, ఛైర్‌పర్సన్ మనోరమ స్వాగతం పలికి సత్కరించారు.



ఉండవల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతూ..

బాల కార్మికులకు విముక్తి

ధరూరు, న్యూస్‌టుడే: కేటిదొడ్డి మండలం పాతపాలెంలో విద్యార్థులను బడికి పంపకుండా తల్లిదండ్రులే వాహనాల్లో ఇతర ప్రాంతాలకు కూలీ పనులకు పంపిస్తున్న వైనాన్ని గుర్తించిన సీఆర్‌పీఎఫ్ కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు వాహనాలను అడ్డుకున్నారు. పాతపాలెం పాఠశాలలో చదువుతున్న 16 మంది విద్యార్థుల వాహనాల్లో నుంచి దింపి బడికి తీసుకొచ్చారు. అనంతరం తల్లిదండ్రులను పాఠశాలకు రప్పించి కౌన్సెలింగ్ ఇచ్చారు. బడికి పంపకుండా పనులకు పంపితే తీసుకునే చర్యల గురించి వివరించారు.

భాజపాతోనే దేశాభివృద్ధి

అయిజ, న్యూస్‌టుడే: భాజపా హయాంలోనే దేశాభివృద్ధి సాధ్యమవుతుందని పార్టీ మండలాధ్యక్షుడు గోపాలకృష్ణ పేర్కొన్నారు. గురువారం మండలంలోని కేశవరం గ్రామంలో నిర్వహించిన ఇంటింటి ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలతోనే నిరుపేదలకు ఫలాలు అందుతున్నాయని వివరించారు. అనంతరం పార్టీ సభ్యత్వ నమోదును చేయించారు. పార్టీ ఓబీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేశ్ యాదవ్, నాయకులు నరసింహులు, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

మోతాదుకు మించి మందులు వాడొద్దు

ధరూరు, న్యూస్‌టుడే: పంటలకు క్రిమిసంహారక మందులు, రసాయనిక ఎరువులు మోతాదుకు మించి వాడవద్దని జిల్లా వ్యవసాయ అధికారి సక్రియానాయక్ సూచించారు. గురువారం మండల పరిధిలోని మన్నాపురం, పార్చెర్ల, గుర్రోనిపల్లి గ్రామాల పరిధిలో పంటలను పరిశీలించారు. వరిపంట వర్షాల కారణంగా ఏపుగా పెరగటం వల్ల దోమపోటుకు గురయ్యే ప్రమాదం ఉంటుందని అందుకు తగిన విధంగా సస్యరక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా అధికారితో పాటు ఏవో శ్రీలత ఉన్నారు.

ఉపాధ్యాయుల చొరవతో ఉత్తమ ఫలితాలు



విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలిస్తున్న కలెక్టర్ సంతోష్

ఇటిక్యాల, న్యూస్‌టుడే: విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా చొరవ చూపాలని కలెక్టర్ సంతోష్ ఉపాధ్యాయులకు సూచించారు. గురువారం బీచుపల్లి గురుకుల పాఠశాల, కళాశాలను ఆకస్మికంగా పరిశీలించారు. తరగతి గదులను, హాస్టల్ మెస్, వంటశాల, దాన్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. విద్యార్థులకు పాఠాలు స్పష్టంగా, అర్థమయ్యే విధంగా బోధించాలని తద్వారా వారు సులభంగా అర్థం చేసుకుని మంచి ఫలితాలు సాధించగలుగుతారన్నారు. విద్యార్థులకు ఎప్పటికప్పుడు పరీక్షలు నిర్వహిస్తూ వారి విద్యాసామర్థ్యాలను పరిశీలిస్తూ ఉండాలన్నారు. ప్రతి విద్యార్థి ఏకరూప దుస్తులతో ఉండాలన్నారు. విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా అన్ని మౌలిక వసతులు కల్పించాలన్నారు. విద్యార్థులు ఆరోగ్యంగా ఉండటానికి సరైన ఆహారం చాలా అవసరమన్నారు. మెనూ ప్రకారం ప్రతి పౌష్టిక ఆహారం అందించాలన్నారు. ప్రిన్సిపల్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కమిషనర్‌పై హైకోర్టును ఆశ్రయించిన ఛైర్‌పర్సన్

శాంతినగర్, న్యూస్‌టుడే: వడ్డేపల్లి పురపాలికలో కొంత కాలంగా జరిగిన అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులు కమిషనర్ చేయడంలేదంటూ, అభివృద్ధిపనులపైన దృష్టి పెట్టడంలేదంటూ, చేయాల్సిన పనులపైనా అభ్యంతరాలు తెలుపుతున్నారని పురఛైర్‌పర్సన్ కరుణ గత నెలలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. అయినా స్పందన లేకపోవడంతో ఆమె హైకోర్టును ఆశ్రయించారు. దానిపైన కోర్టు గురువారం డైరెక్షన్ ఇచ్చిందన్నారు. పురపాలిక ముఖ్య కార్యదర్శికి, డైరెక్టర్‌కు పిటిషన్ చేసుకోవాలని సూచించినట్లు తెలిపారన్నారు.

ప్లీనరీని విజయవంతం చేద్దాం

అయిజ, న్యూస్‌టుడే: నవంబరు 3న హైదరాబాదులోని ఆదిభట్లలో నిర్వహించిన తలపెట్టిన ధర్మసమాజ్ పార్టీ ప్లీనరీని విజయవంతం చేద్దామని పార్టీ జిల్లా అధ్యక్షుడు నరేశ్ మహారాజ్ పేర్కొన్నారు. గురువారం అయిజలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ముఖ్యనాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అగ్రవర్ణ భూస్వామ్య, రాజకీయ వ్యవస్థపై ఆత్మగౌరవంతో యుద్ధం చేయడానికి ధర్మ సమాజ్ పార్టీని స్థాపించారని ఆయన వివరించారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ పేదల రాజ్యాన్ని నిర్మించడానికి భవిష్యత్తు కార్యచరణను ప్లీనరీలో రూపొందిస్తారని ఆయన వివరించారు. భరత్, భాస్కర్, రమేశ్, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

తుంగభద్రలో 1.07 లక్షల క్యూసెక్కుల ప్రవాహం

శాంతినగర్, రాజోలి, న్యూస్‌టుడే: తుంగభద్ర నదిలో 1,07,250 క్యూసెక్కుల ప్రవాహం ఉంది. జలాశయం నుంచి 63 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ఆర్డీఎస్ ఆనకట్ట వద్ద గురువారం 13.1 అడుగుల ఎత్తులో నీటిప్రవాహం ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. ప్రధాన కాల్వకు 8.5 అడుగుల నీటిని విడుదల చేస్తుండగా, అది రాష్ట్రానికి వచ్చేసరికి 5.3 అడుగులుగా ఉంది. * సుంకేసుల జలాశయంలోకి ఎగువ నుంచి 1,18,200 క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది. జలాశయం నుంచి దిగువకు 1,15,736 క్యూసెక్కుల నీటిని శ్రీశైలం జలాశయంవైపు విడుదల చేస్తున్నారు. జలాశయం నుంచి అధికమొత్తంలో నీటి విడుదల వల్ల రాజోలి సమీపంలోని వాగులోకి నీరు ఎదురెక్కుతోంది.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

ధరూరు, న్యూస్‌టుడే: కేటిదొడ్డి మండల పరిధిలోని నందిన్నె గ్రామానికి చెందిన మహిళ రోడ్డుప్రమాదంలో గాయపడి మృతిచెందింది. గ్రామస్థుల కథనం మేరకు నందిన్నె గ్రామానికి చెందిన సుజాత (35) గురువారం ఉదయం నందిన్నె నుంచి ద్విచక్రవాహనంపై వెనక కూర్చొని వెళ్తుండగా ప్రమాదవశాత్తు జారి కిందపడిపోయింది. తలకు బలమైన గాయం కావటంతో అపస్మారక స్థితిలో ఉన్న ఆమెను చికిత్స నిమిత్తం రాయచూరు అస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సాయంత్రం మృతిచెందింది.

హత్యానేరం కేసు నమోదు చేయాలి: భారాస




మానవపాడులో కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న బీఎస్పీ నాయకులు

గద్వాల కలెక్టరేట్, మానవపాడు, న్యూస్‌టుడే: మల్దకల్ మండలం బిజ్వారం గ్రామానికి చెందిన బాలిక ఆత్మహత్యకు కారకులైన వారిపై హత్యా నేరం కింద పోలీసులు కేసు నమోదు చేయాలని భారాస రాష్ట్ర నాయకుడు విజయ్‌కుమార్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. బాలిక 10 రోజుల కింద పురుగుల మందు తాగి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటనపై భారాస తీవ్రంగా స్పందించింది. అక్రమంగా దొంగతనం కేసు నమోదు చేయడాన్ని భరించలేక బాలిక పురుగుల మందు తాగిందని, ప్రధాన కారకుడిని కాపాడటానికి అధికార పార్టీకి చెందిన బడా నాయకులు రంగంలోకి దిగారని, పోలీసులు ఈ కేసును నీరుగార్చేందుకు ప్రయత్నిస్తున్నారనే అనుమానాలు కలుగుతున్నాయని ఆరోపించారు.

కొవ్వొత్తులతో నివాళి: బాలిక మృతి బాధాకరమని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు రాంబాబు అన్నారు. మానవపాడులో కొవ్వొత్తులతో నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ఓ సీడ్ ఆర్గనైజర్ బాలికను పనిలో పెట్టుకొని దొంగతనం చేసిందనే నెపంతో తప్పుడు కేసు పెట్టడంతో మనస్తాపానికి గురై ఆత్మహత్యకు యత్నించి 13 రోజుల మృత్యువుతో పోరాడి మృతిచెందడం దిగ్భ్రాంతికి గురిచేసిందన్నారు. బాలిక మరణానికి కారణమైన వారిని వెంటనే జైలుకు పంపాలని ఆయన డిమాండ్ చేశారు. జిల్లా కార్యదర్శి రాజు, యేసు, దావీదు, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ఆత్మగౌరవ సభ విజయవంతం చేద్దాం



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న మాలమహానాడు నాయకులు

అయిజ, న్యూస్‌టుడే: నాగర్‌కర్నూల్‌లో ఈనెల 27న నిర్వహించతలపెట్టిన మాలల ఆత్మగౌరవసభను విజయవంతం చేద్దామని మాలమహానాడు సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు రంగముని పేర్కొన్నారు. గురువారం అయిజలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద సంఘం నాయకులు ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా నిర్వహించనున్న సభకు పెద్దఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. మాలమహానాడు సంఘం నాయకులు మునిస్వామి, శేఖర్, రాము, ఈరన్న, మల్లికార్జున్, నరసింహులు, వీరేశ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

చేదెక్కుతున్న చెరకు



కొత్తకోట, న్యూస్‌టుడే: అందరికీ(చక్కెర) తీపిని అందించే చెరకు రైతులు మద్దతు ధర లభించక, చేసిన వ్యవసాయంలో వచ్చిందంతా అప్పులు చెల్లించేందుకే సరిపోయి కుదేలవుతున్నారు. ఏటా పెరుగుతున్న విత్తనాల ధరలు, ఎరువులు, కూలీల వేతనాలు పెట్టుబడులు గణనీయంగా పెరిగాయి. సరైన దిగుబడులు లేక, చేతికొచ్చిన పంటకు మద్దతు ధర లేక కర్షకులకు కష్టాలే మిగులుతున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెరకును మరిచి ఇతర పంటలకు మద్దతు ధర పెంచడం, బోనస్‌లు ఇవ్వడం వారిని పంట మార్పిడి వైపు చూసేలా చేస్తోంది.

తగ్గుతున్న సాగు విస్తీర్ణం : ఉమ్మడి జిల్లాలో ఉన్న కృష్ణవేణి చక్కెర కర్మాగారం పరిధిలో ఏడేళ్ల క్రితం ఆరు వేల మంది రైతులు 15 వేల ఎకరాల్లో చెరకు సాగు చేసేవారు. ప్రస్తుతం వీరి సంఖ్య గణనీయంగా పడిపోయింది. ఉమ్మడి జిల్లానే కాకుండా పొరుగు జిల్లాలైన రంగారెడ్డి, వికారాబాద్ నుంచి కూడా చెరకు రైతులు ఉన్నారు. గతేడాది 5,950 ఎకరాల్లో చెరకు సాగు చేశారు. దాదాపు 2 వేల మంది ఈ పంట సాగు చేస్తుండగా యాజమాన్యం నుంచి తగిన ప్రోత్సాహం ఉండటం లేదని రైతులు పెదవి విరుస్తున్నారు. ఒక్క సారి విత్తనాలు వేస్తే నాలుగేళ్ల పంట వస్తుంది. తొలి ఏడాది అధిక పెట్టుబడులున్నా తర్వాత ఏడాది పెట్టుబడి సమస్యలు అంతగా ఉండవని సాగులోకి దిగిన రైతులు ఏటి కేడాది ఇక చాలు అని చెరకు సాగుకు దూరమవుతున్నారు. ప్రస్తుతం రైతులకు రికవరీ రేటు ఆధారంగా రూ.3,340 మద్దతు ధర చెల్లిస్తున్నా అనేక కొర్రీలతో వారికి చేరే సరికి ఏమీ మిగలడం లేదని వాపోతున్నారు.

ఖర్చు రూ.లక్ష పైమాటే : ఎకరా చెరకు సాగు చేయాలంటే పెట్టుబడులన్నీ కలిపి తొలి ఏడాది రూ.లక్ష ఖర్చు చేయాల్సి ఉంటుందని కర్షకులు చెబుతున్నారు. గతేడాది కోత, రవాణా ఖర్చు టన్నుకు రూ.1,100 చెల్లించాల్సి వచ్చింది. ఒక్కో ఎకరాకు సరాసరి 30 టన్నుల చెరకు పండుతుంది. ప్రస్తుత ధరతో పోలిస్తే రైతుకు రూ.లక్ష వస్తోంది. వీటిలో కోత, రవాణా ఖర్చులు మినహాయిస్తే మిగిలేది రూ.77 వేలన్నమాట. ఏడాది పంట కోసం ఎరువులు, ఇతర పెట్టుబడులు అప్పుగా తేవాల్సిందే. అందుకు వడ్డీ చెల్లించాలి. ఇలా చెల్లింపుల్లో రవాణా కోత ఖర్చులు పోతే మిగిలింది ఎరువులు, ఇతర పెట్టుబడులకే సరిపోవడం లేదు. ఇక కౌలు రైతు పరిస్థితి మరీ దారుణం ఎకరాకు రూ.15 వేలు కౌలు చెల్లించాల్సి ఉంటుంది. ఇలా రైతుకు ఎక్కడికక్కడ నష్టం వాటిల్లుతున్న తరుణంలో ఇతర పంటల సాగుకు ఆసక్తి చూపుతున్నారు.

ప్రత్యామ్నాయం వెతుకుతున్న రైతులు



● స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల మేరకు కనీస మద్దతు ధర రూ.5,600 ఇవ్వాల్సి ఉంది. రికవరీతో సంబంధం లేకుండా కోత, రవాణా ఖర్చులు పోను రూ.3,500 చెల్లించాలన్నది యాజమాన్యాలు అంగీకరించకుంటే వచ్చే ఏడాది సాగు మరింత తగ్గుతుంది. బోనస్‌ను పరిగణలోకి తీసుకుంటే వరి సాగు లాభసాటిగా ఉంది. పత్తి, వేరుసెనగ, ఆముదం వంటి పంటలు వేసుకున్నా లాభపడొచ్చు.

-రాజన్న, ఉమ్మడి జిల్లా చెరకు రైతు సంఘం అధ్యక్షుడు

ఆడపడుచులకు అండగా కాంగ్రెస్: ఎమ్మెల్యే



లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి

గద్వాల కలెక్టరేట్, న్యూస్‌టుడే: కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేసే విధంగా కృషిచేస్తుంటే, ప్రతిపక్షాలు కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ కింద అందించే ఆర్థిక సాయం నిలిచిపోతుందని ప్రచారం చేస్తున్నారని, ఇందులో ఎంత మాత్రం నిజం లేదని ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదింటి ఆడపడుచులకు అండగా ఉంటుందని స్పష్టం చేశారు. గురువారం క్యాంపు కార్యాలయంలో ధరూర్ మండలానికి చెందిన 139 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. మార్కెట్ యార్డు ఛైర్మన్ హనుమంతు, నాయకులు గట్టు తిమ్మప్ప, బండారి భాస్కర్, రామన్‌గౌడా, గడ్డం కృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

క్రీడా పోటీలు వాయిదా

అయిజ, న్యూస్‌టుడే: ఈనెల 26, 28న నిర్వహించతలపెట్టిన సీఎం కప్ క్రీడా మండల స్థాయి పోటీలను ఈనెల 29, 30 తేదీలకు వాయిదా వేసినట్లు ఎంపీడీవో వెంకటయ్య తెలిపారు. విద్యార్థులకు త్రైమాసిక పరీక్షలు ఉన్న కారణంగా వాయిదా వేసినట్లు వివరించారు. అయిజలోని తిక్కవీరేశ్వరస్వామి ఆలయ మైదానంలో పోటీలు నిర్వహిస్తారని క్రీడాకారులు దీన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు.

ఎమ్మార్సీ కార్యాలయం ప్రారంభం



కార్యాలయం ప్రారంభిస్తున్న ఎంఈవో అమీర్ భాషా

ఇటిక్యాల, న్యూస్‌టుడే: నూతన మండలంగా ఏర్పడిన ఎర్రవల్లిలోని కొండేరు గ్రామ పంచాయతీలో గురువారం విద్యాధికారి అమీర్ భాషా ఎమ్మార్సీ కార్యాలయం ప్రారంభించారు. మండలం ఏర్పడిన కొత్తలో బీచుపల్లి గ్రామ పంచాయతీ అనుబంధ గ్రామమైన యాక్తాపురంలో కార్యాలయం ఏర్పాటు చేశారు. అయితే ప్రతి మండలానికి ఒక్క విద్యాధికారిని నియమించిన అనంతరం ఎర్రవల్లి మండలం కేంద్రంలో ప్రభుత్వ భవనాలు అందుబాటులో లేకపోవడంతో కొండేరులోని ప్రాథమిక పాఠశాలలోని ఓ గదిని ఎమ్మార్సీ కార్యాలయంగా ఏర్పాటుచేసుకున్నారు. మాజీ విద్యాధికారి రాజు, జీహెచ్‌ఎంలు లక్ష్మిరెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శ్రీశైలంలో 4 గేట్ల ద్వారా నీటి విడుదల

శ్రీశైలం ప్రాజెక్టు(అమ్రాబాద్), న్యూస్‌టుడే : ఎగువ ప్రాంతాల నుంచి నీటి ప్రవాహం పెరగడంతో శ్రీశైలం జలాశయం పూర్తిగా నిండింది. గురువారం 4 గేట్లను 10 అడుగుల మేర ఎత్తి 1,12,300 క్యూసెక్కులు, కుడి, ఎడమ విద్యుత్తు కేంద్రాల ద్వారా 67,876 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. సాయంత్రం 6 గంటలకు 885 అడుగుల (212.387 టీఎంసీలు)గా నమోదైనట్లు అధికారులు తెలిపారు. జూరాల ప్రాజెక్టు నుంచి 70,552 క్యూసెక్కులు, సుంకేసుల నుంచి 1,18,776 క్యూసెక్కుల వరద నీరు జలాశయానికి చేరుతోంది.



దిగువకు విడుదలవుతున్న నీరు

తాగునీటి వృథా



గద్వాల పుర పరిధిలోని గాంధీ చౌక్ నుంచి కృష్ణారెడ్డిబంగ్లాకు వెళ్లే మార్గంలో తాగునీటి పైపు లైన్ లీకై ప్రధాన రహదారిపై ఇలా వృథాగా పారుతోంది. కొన్ని నెలల నుంచి పైప్‌లైన్ లీకై భారీగా నీరు రోడ్డుపై వృథాగా పోతున్నా. అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీంతో అటుగా వెళ్తున్న ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పైప్‌లైన్ మరమ్మతు పనులు చేపట్టి సమస్యను పరిష్కరించాలని అటు కాలనీ వాసులు.. ఇటు ప్రయాణికులు కోరుతున్నారు. పురపాలిక అధికారుల దృష్టికి తీసుకెళ్లగా సిబ్బందికి చెప్పి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు.

-న్యూస్‌టుడే, గద్వాల పట్టణం

బస్టాండు.. బురదమయం



మానవపాడులో టీఎస్ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణం ఇటీవల కురిసిన వర్షాల కారణంగా నీరు నిలిచి బురదమయంగా దర్శనమిస్తోంది. ఫలితంగా దుర్వాసన వెదజల్లడంతో పాటు దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. అలాగే ప్రయాణ ప్రాంగణంలో టీ స్టాళ్లు, తినుబండారాల దుకాణాలు ఉండటంతో ప్రజలు వస్తుంటారు. స్థానికంగా ఉన్న జడ్పీ ఉన్నత పాఠశాలకు ఆర్టీసీ బస్సు ద్వారా వివిధ గ్రామాలకు చెందిన విద్యార్థులు కూడా మానవపాడుకు రోజూ వస్తుంటారు. దుర్వాసన కారణంగా విద్యార్థులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయంపై గద్వాల ఆర్టీసీ డిపో మేనేజర్ మురళీకృష్ణను 'న్యూస్‌టుడే' సంప్రదించగా.. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

-న్యూస్‌టుడే, మానవపాడు

చెకుముకి సైన్స్ సంబరాలకు సన్నాహాలు

● నవంబరు 7 నుంచి ప్రారంభం ● 8-10 తరగతుల విద్యార్థులు అర్హులు

అచ్చంపేట, న్యూస్‌టుడే: విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీసి ప్రోత్సహించేందుకు జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఏటా చెకుముకి సైన్స్ సంబరాలు నిర్వహిస్తున్నారు. తెలంగాణ సమగ్ర శిక్ష సహకారంతో అన్ని యాజమాన్యాల పరిధిలోని పాఠశాలల్లో 2024-25 విద్యా సంవత్సరంలో 8-10 తరగతి చదువుతున్న విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనేందుకు అర్హులు. సైన్స్ పట్ల విద్యార్థులకు ఆసక్తిని పెంపొందించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పాఠశాల, మండల, జిల్లా, రాష్ట్రస్థాయిలో విద్యార్థులకు ఈ పోటీలుంటాయి. ప్రధానోపాధ్యాయుల ద్వారా ఈ పోటీల్లో పాల్గొనేందుకు విద్యార్థులు పేర్లు నమోదు చేసుకోవాలి. ఉమ్మడి జిల్లాలోని అన్ని యాజమాన్యాల పరిధిలోని 8-10 తరగతులు చదువుతున్న విద్యార్థులు చెకుముకి సైన్స్ ప్రతిభ పరీక్షలో పాల్గొనేందుకు అవకాశం కల్పించారు.



పరీక్షకు సిద్ధమవుతున్న విద్యార్థులు

పోటీల వివరాలు ఇలా

విద్యార్థులకు మొదట పాఠశాల స్థాయిలో ప్రతిభ పరీక్ష నిర్వహించనున్నారు. నవంబరు 7న పాఠశాల స్థాయి, 21న మండల స్థాయి, 28న జిల్లా స్థాయిలో పోటీలు నిర్వహించనున్నారు. రాష్ట్రస్థాయి పోటీలు ఆదిలాబాద్‌లో డిసెంబరు 14-16 వరకు నిర్వహించనున్నారు. 8, 9, 10 తరగతులకు సంబంధించిన సైన్స్, గణితం, సాంఘికశాస్త్రం, సమకాలీన శాస్త్ర, సాంకేతిక అంశాలపై పోటీలుంటాయి. వీటిని తెలుగు, ఆంగ్ల మాధ్యమాల్లో నిర్వహించనున్నారు. పాఠశాల స్థాయిలో ప్రతిభ చాటిన విద్యార్థులకు మండల స్థాయిలో పోటీలు నిర్వహించి విజేతలను ఎంపిక చేస్తారు. అన్ని మండలాల విజేతలకు జిల్లాస్థాయిలో పోటీలు నిర్వహించి ఆయా జిల్లాల నుంచి ఎంపికైన విజేతలకు రాష్ట్రస్థాయికి పంపుతారు.

రాష్ట్ర స్థాయిలో..

చెకుముకి సైన్స్ సంబరాల్లో భాగంగా వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. రాష్ట్రస్థాయిలో సైన్స్ ప్రయోగాలు, సైన్స్ జాతర, మీట్ ది సైంటిస్ట్, సైన్స్ ఎగ్జిబిషన్, పుస్తక ప్రదర్శన కార్యక్రమాలు నిర్వహించి విద్యార్థులకు అవగాహన కల్పించనున్నారు. జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో సైన్స్ సంబరాలను ఘనంగా నిర్వహించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామని జేవీవీ జిల్లా ప్రతినిధి బాల్‌రాం తెలిపారు. అన్ని పాఠశాలల్లో విద్యార్థులు పాల్గొనేలా సైన్స్ ఉపాధ్యాయులు శ్రద్ధ తీసుకోవాలని కోరారు.


57 చరవాణులు బాధితులకు అప్పగింత



ఎస్పీతో చరవాణులు అందుకున్నవారు

గద్వాల అర్బన్, న్యూస్‌టుడే: వివిధ పోలీసు ఠాణాల పరిధిలో పోగొట్టుకున్న 57 చరవాణులను ఎస్పీ శ్రీనివాసరావు బాధితులకు గురువారం జిల్లా ప్రధాన పోలీసు కార్యాలయంలో అందజేశారు. తమ చరవాణులు చోరీకి గురైనా.. ఎక్కడైనా పోగొట్టుకున్నా ఆందోళన చెందాల్సిన అవసరం లేదని బాధితులకు ఎస్పీ చెప్పారు. సీఈఐఆర్(సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటి) పోర్టల్ ద్వారా ఫిర్యాదు చేసిన బాధితులకు అప్పగిస్తామని పేర్కొన్నారు. బాధితులకు చరవాణులు దక్కేలా వ్యవహరించిన సీఈఐఆర్ సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

గర్భకోశవ్యాధులపై అవగాహన అవసరం



ఎల్కూరులో అవగాహన కల్పిస్తున్న జిల్లా పశువైద్యాధికారి

మల్దకల, న్యూస్‌టుడే: పాడి పశువుల్లో వచ్చే గర్భకోశవ్యాధులపై రైతులు అవగాహన కలిగి ఉండాలని జిల్లా పశువైద్యాధికారి పి.వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం మల్దకల్ మండలం ఎల్కూరులో పశువైద్యాధికారిణి యామినిసాయి, ఉష, వినయకుమార్ ఆధ్వర్యంలో ఉచిత గర్భకోశవ్యాధి చికిత్స శిబిరం నిర్వహించగా ఆయన హాజరై మాట్లాడారు. చూడిపశువుల పోషణ, పశుగ్రాసాల సాగుపై అవగాహన కల్పించారు. కృత్రిమ గర్భధారణ చేయిస్తే 90శాతం కన్నా ఎక్కువ మేలు జాతి ఆడదూడలు పుట్టి రైతులకు పశుపోషణ మరింత లాభసాటిగా ఉంటుందన్నారు. అసిస్టెంట్ డైరెక్టర్ రమేష్, పశువైద్యాధికారి వెంకట్రాజు, రాజేంద్ర, రామాంజనేయులు, అర్జున్, రాము తదితరులు పాల్గొన్నారు.